ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు 5
మంగళవారం 4 మార్చి 2025





	ఇఫ్తార్	సెహరి
	మంగళవారం	బుధవారం
కర్నూలు	6: 31	5:11
నంద్యాల	6: 28	5:11

గాడి తప్పుతున్న ఖాకీలు

నంద్యాల జిల్లాలో కొందరు పోలీసు అధికారుల పనితీరు పలు విమర్శలకు తావిస్తోంది. ప్రధానంగా ఇద్దరు డీఎస్పీలు, ఐదుగురు సీఐలపై ఇటీవలి కాలంలో తీవ్రస్థాయిలో ఆరోపణలు వస్తున్నాయి. ఈ అధికారులు చేతివాటం ప్రదర్శిస్తూ అక్రమ వసూళ్లు, సెటిల్‌మెంట్లకు పాల్పడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. కొందరైతే కేసులు కూడా నమోదు చేయకుండా పంచాయితీలు చేసి క్యాష్ చేసుకుంటున్నారని ఆ శాఖ వర్గాల నుంచి తెలిసింది. పేకాటరాయళ్ల నుంచి సారా విక్రేతలు, బంగారు దుకాణాలు, మైన్స్ వ్యాపారులు, వివిధ ఫ్యాక్టరీ యజమానుల వరకు ఎక్కడికక్కడ అందినకాడికి దోచుకోవడమే లక్ష్యంగా కొందరు పోలీసులు పని చేస్తున్నారని సమాచారం. ఆ పోలీసుల ప్రవర్తనతో జిల్లా పోలీసు శాఖకే మచ్చ వచ్చే ప్రమాదం ఉందన్న ప్రచారం జిల్లాలో జోరందుకుంది. ఈ క్రమంలో వారిపై చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులు సిద్ధమైనట్లు తెలిసింది.



- జిల్లా పోలీసులపై అవినీతి మరక
- కీలక అధికారులపై ఆరోపణలు
- సెటిల్‌మెంట్ల పేరుతో బెదిరింపులు
- ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ఓ ఎమ్మెల్యే
- త్వరలో ఓ డీఎస్పీ, ఇద్దరు సీఐలపై వేటు పడే అవకాశం

బదిలీకి రంగం సిద్ధం

నంద్యాల, మార్చి3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాలుగు సబ్ డివిజన్ కార్యాలయాలు ఉన్నాయి. వీటిలో నలుగురు డీఎస్పీలు పనిచేస్తున్నారు. అయితే వీరిలో ఇద్దరు డీఎస్పీల తీరుపై పలు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. వీరిలో ఓ డీఎస్పీ మోనార్క్‌లా వ్యవహరిస్తున్నారని పోలీసు వర్గాల నుంచి తెలిసింది. తమ సబ్ డివిజన్ పరిధిలో ఎక్కడ ఏం జరిగినా...? ఎలాంటి కేసు వచ్చినా..? పంచాయతీలు చేయాలని ఆదేశించడం.. ఆ తర్వాత వారంతా కలిసి క్యాష్ చేసుకోవడం జరుగుతోందని సమాచారం. వీటితో పాటు తమ పరిధిలోని పోలీసు స్టేషన్ల నుంచి నెలవారీ మామూళ్లు కూడా పెద్దఎత్తున సదరు డీఎస్పీ తీసుకుంటున్నారని తెలిసింది. ఎవరైనా సీఐలు తన మాట వినకపోతే ఇక వారికి వేధింపులు మొదలవుతాయి. అలాంటి సీఐలపై ఫిర్యాదులు వస్తే చాలు షోకాజ్ నోటీసుల పేరుతో బెదిరించి తమదారికి తెచ్చుకుంటున్నారు. ఇక డివిజన్ అధికారి అండదండలతో కొందరు సీఐలు, ఎస్ఐలు సైతం మరింత పోలీసు పవర్‌ను అడ్డుగా పెట్టుకుని అక్రమ వసూళ్లకు తెరలేపారని సమాచారం. అయితే సదరు డీఎస్పీ ఆగడాలను తట్టుకోలేక కొందరు పోలీసులు ఆయనపై జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు జనవరి నెలలో సీక్రెట్‌గా ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

ఆయన స్టైలే వేరు..!

జిల్లాలోని మరో డీఎస్పీ తీరు మాత్రం భిన్నంగా ఉంటుంది. తమ కింద పని చేస్తున్న కొందరు సీఐలతో కలిసి అక్రమ వసూళ్లకు తెరలేపారని సమాచారం. అయితే ఎక్కడా వీరి అవినీతి అక్రమాలు బయటకు పొక్కకుండా జాగ్రత్త పడటంలో ఆయన నేర్పరి. సాధారణంగా ఎక్కడైనా ఓ డీఎస్పీని నియమిస్తే.. ఆయన కింద పని చేసే సీఐలు ఎక్కడెక్కడ నుంచో వస్తుంటారు..? కానీ ఇక్కడ సీన్ మాత్రం వేరు. సదరు డీఎస్పీ గతంలో సీఐగా, డీఎస్పీగా పనిచేసిన సమయంలో అక్కడ పని చేసిన సీఐలు, ఎస్ఐలను తమ సబ్ డివిజన్‌కు పోస్టింగ్ వేయించుకునేలా సంబంధిత ప్రజాప్రతినిధిని ఒప్పించారు. అలా పోస్టింగ్‌లు వేయించుకుని మరీ అక్రమాలకు పాల్పడుతున్నారని వినికిడి. ఆయన డివిజన్‌లో పనిచేసే వారిలో ఎక్కువ శాతం గతంలో ఆయన వద్ద పనిచేసిన వారేనని ప్రచారం సాగుతోంది. ఫైనాన్షియల్ వ్యవహారాలన్నీ చక్కబెట్టేందుకు ఓ సీఐని మధ్యవర్తిగా ఏర్పాటు చేసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ఓ విశ్రాంత పోలీస్ ఉన్నతాధికారి ఓ సీఐ పోస్టింగ్ కోసం సదరు డీఎస్పీ పరిధిలోని ప్రజాప్రతినిధిని కలిసి ఒప్పించుకున్నారు. వెంటనే ఈ విషయం తెలుసుకున్న ఆ డీఎస్పీ వెంటనే సదరు ప్రజాప్రతినిధి కలిసి ఆ సీఐ తన డివిజన్‌లోకి రానీయకుండా అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఆ సబ్ డివిజన్‌లో పనిచేస్తున్న కొందరు సిబ్బంది ఈ వ్యవహారాలను చూడలేక అసంతృప్తితో ఉన్నారు.

త్వరలో ముగ్గురు పోలీసు అధికారులపై బదిలీ వేటు..?



జిల్లా పోలీస్ శాఖలో హెచ్చుమీరిన అవినీతిపై రేంజ్‌లోని కీలక అధికారితో పాటు, రాష్ట్రస్థాయి అధికారులు నిఘా ఉంచినట్లు తెలుస్తోంది. వీరి వ్యవహారంపై కీలక ఉన్నతాధికారులు చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. త్వరలో వారిపై బదిలీ వేటు పడనుందని సమాచారం. సదరు అధికారులపై సంబంధిత ప్రజాప్రతినిధి సైతం పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. కొన్ని కేసులతో పాటు లోగుట్టుగా వైసీపీ వర్గాలకు అనుకూలంగా వ్యవహరించారని ఓ ఎమ్మెల్యే దృష్టికి వెళ్లినట్లు తెలిసింది. మరికొన్ని కేసుల్లో అయితే ఏకంగా ప్రజాప్రతినిధి చెప్పినా కూడా సదరు పోలీసులు తమదైన శైలిలో పంచాయితీలు చేసి సోమ్ముచేసుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో సదరు పోలీసు అధికారులపై ఆ ప్రజాప్రతినిధి అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో సదరు అధికారులపై బదిలీ వేటు వేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

ఐదుగురు సీఐలపై అవినీతి ఆరోపణలు



జిల్లా పోలీసు శాఖలో పనిచేస్తున్న ఐదుగురు సీఐలపై అవినీతి ఆరోపణలు తారస్థాయికి చేరాయి. వీరిలో ఒక సీఐ జిల్లా కేంద్రంలో పని చేస్తుండగా మరొకరు డీఎస్పీ పరిధిలో పని చేస్తున్నారు. మరో ఇద్దరు 'అనుకూల డీఎస్పీ' కింద పని చేస్తున్నారు. మరో సీఐ.. కొత్తగా విధుల్లో చేరిన డీఎస్పీ పరిధిలో పని చేస్తున్నారని సమాచారం. వీరందరూ కూడా ఆయా డీఎస్పీల అండదండలతో తమదైన శైలిలో కానిస్టేబుళ్లను టీంగా పెట్టుకుని మరీ వసూళ్లకు పాల్పడుతున్నారని సమాచారం. ప్రధానంగా పేకాటరాయుళ్లు, సారా విక్రేతలు, మద్యం దుకాణాలు, మైనింగ్ (మట్టి) తరలింపు టిప్పర్ల యజమానుల నుంచి భారీగా నెలవారీ వసూళ్లు చేస్తున్నారని విమర్శలు జోరందుకున్నాయి. ఇది చాలదన్నట్టు వీరిలో ఒక సీఐ అయితే మరింత బరితెగించారు. ఏకంగా బంగారు దుకాణాల యజమానుల నుంచి అక్రమ బంగారు విక్రయింపు పేరుతో బెదిరించి వసూళ్లు చేస్తున్నారని సమాచారం. వీటితో పాటు ఆయా స్టేషన్లకు వచ్చిన కేసుల పరంగా తమదైన శైలిలో పంచాయితీలు చేసి చేతివాటం ప్రదర్శించి సొమ్ము చేసుకుంటున్నారని తెలిసింది. వీరిలో మరొక సీఐ సైతం కాసులకు కక్కుర్తి పడి తమ పరిధి కాకపోయినా.. ఇద్దరు పేకాటరాయుళ్లకు ఫోన్ చేసి రూ.లక్షల్లో డిమాండ్ చేయడం విస్మయం కలిగిస్తోంది. (వీరు రెండు నెలల క్రితం కర్నూలు జిల్లాలో పట్టుపడిన కేసులో తప్పించుకున్న ఇద్దరు పేకాటరాయుళ్లు). మరో సీఐ మాత్రం కొత్తగా వచ్చిన డీఎస్పీ కింద పని చేస్తున్నారు. సదరు సీఐ కూడా తమ పరిధిలోని బండల ఫ్యాక్టరీల యజమానులు, వ్యాపారుల నుంచి రూ.లక్షల్లో ముడుపులు తీసుకుంటున్నారని సమాచారం.

ఉమ్మడి జిల్లాలో రెండు నెలల క్రితం రూ.1.30 కోట్లతో పట్టుబడిన పేకాట ముఠా కేసును సైతం పైరవీలు చేసి గంజాయి కేసుగా నమోదు చేసి సదరు పోలీసులు చేతులు దులుపుకున్నారని సమాచారం. ఈ కేసులో రూ.లక్షల్లో చేతులు మారినట్లు ఆ శాఖ వర్గాల ద్వారా తెలిసింది. ఈ కేసులో తప్పించుకున్న ఇద్దరు జూదరులనే మళ్లీ ఓ సీఐ రూ.లక్షల్లో డిమాండ్ చేశారని సమాచారం.

అన్యాక్రాంతం కానీయం

కలెక్టర్ రాజకుమారి


రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

బండిఆత్మకూరు, మార్చి3(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పొలాలు అన్యాక్రాంతం కాకుండా చూస్తామని, వాటిని సర్వే చేయించి స్వాధీనపరుచుకుంటామని కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని కడమలకాల్వ గ్రామంలో జరుగుతున్న భూ రీసర్వేను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమెతో రైతులు మాట్లాడుతూ ప్రేమచెర్వులో, కృష్ణనందిలో భూములు అన్యాక్రాంతమయ్యాయని తెలుపగా.. వాటిని సర్వే చేయించి స్వాధీనం చేసుకుంటామన్నారు. పెద్దల ద్వారా అన్నదమ్ములకు సంక్రమించిన భూమికి ఆన్‌లైన్ సమస్యలు ఉన్నాయని రైతులు విన్నవించగా.. వాటికి తగిన పరిష్కారం చూపుతామని అన్నారు. అనంతరం కలెక్టర్ శివనందీశ్వర, పార్వతీ దేవి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఏడీ సర్వే జయరాజ్, తహసీల్దార్ పద్మావతమ్మ, మండల సర్వేయర్ పర్విన్, సర్వేయర్ ఫయాజూన్, వీఆర్వో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం


హాల్‌టిక్కెట్ నెంబర్‌ను చూసుకుంటున్న విద్యార్థులు

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో సోమవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 53 పరీక్షా కేంద్రాల్లో తెలుగు, సంస్కృతం, హిందీ పరీక్షలు పరీక్షలు జరిగాయి. మొత్తం 12,182 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 11,875 మంది హాజరయ్యారు. 307 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈవో సునీత తెలిపారు.

మహా శివరాత్రి ఆదాయం రూ.58.36 లక్షలు


ఈవో శ్రీనివాసరెడ్డి

మహానంది, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో ఆరు రోజుల పాటు జరిగిన మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని వివిధ సేవల ద్వారా రూ.58,36,566 ఆదాయం దేవస్థానానికి లభించినట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం దేవస్థానం ప్రధాన కార్యాలయంలో శివరాత్రి సందర్భంగా భక్తులకు వివిధ సేవల ద్వారా వచ్చిన ఆదాయ వివరాలను ఈవో తెలిపారు. ఇందులో ప్రత్యేక దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2130271.00 ఆర్జిత సేవల ద్వారా రూ.20500.00, తలనీలాల ద్వారా రూ13100.00, లడ్డూ ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1403640.00, పులిహోర విక్రయం ద్వారా రూ.545540.00, పబ్లికేషన్ ద్వారా రూ.25769.00, జాయింట్ వీల్ ద్వారా రూ.51500.00, టెంపర్‌వరీ దుకాణాల ద్వారా రూ.1325970.00, మిగతా సేవల ద్వారా రూ.233481.00 ఆదాయం వచ్చినట్లు ఈవో వెల్లడించారు. గత ఏడాది మహా శివరాత్రి ఉత్సవాల కంటే రూ.2 లక్షల ఆదాయం అధికంగా వచ్చిందన్నారు. ఉత్సవాలు విజయవంతంగా జరగడానికి కృషి చేసిన అధికారులను ఈవో అభినందించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ యర్రమల్ల మధు, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, వేదపండితులు నాగేశ్వరశర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

పరవశించిన మంత్రాలయం

- రాఘవరాయలకు స్వర్ణ కవచ సమర్పణ సేవ
- ఘనంగా సాగుతున్న గురు వైభవోత్సవాలు


మఠం ప్రాంగణంలో రద్దీగా ఉన్న భక్తులు

మంత్రాలయం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద్రస్వామి గురువైభోత్సవాల్లో మూడో రోజు సోమవారం వైభవంగా నిర్వహించారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు రాఘవేంద్రస్వామి బంగారు పాదుకలను తలపై పెట్టుకుని తన గురుభక్తిని చాటుకున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులతో మంత్రాలయం పులకరించింది. రాఘవేంద్రస్వామి మూలబృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసిఅర్చన, విశేష పంచామృతాభిషేకం, అష్టోదకం చేశారు. బంగారు, వెండి ఆభరణాలతో పాటు స్వర్ణ కవచసేవ సమర్పణ, వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి పీఠాధిపతి మహామంగళహారతులు ఇచ్చారు. మూలరాములకు కనకాభిషేకం చేశారు. అంతకుముందు గ్రామదేవత మంచాలమ్మకు విశేష మంగళహారతులు ఇచ్చారు. వెండి గజవాహనంపై బంగారు అంబారిలో సుందరంగా తీర్చిదిద్దిన ప్రహ్లాదరాయలను అధిష్టించి చెక్క, వెండి, బంగారు రథాలపై ఊరేగించి ఊంజల సేవ చేశారు.



నేటి నుంచి నారసింహుడి బ్రహ్మోత్సవాలు

- అహోబిలంలో అంకురార్పణకు ఏర్పాట్లు
- సర్వం సిద్ధం చేసిన అధికారులు



ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 3(ఆంధ్రజ్యోతి) : ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలంలో లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలకు నేడు అంకురార్పణ చేయనున్నారు. ఈ సందర్భంగా ఎగువ అహోబిలంలో ఆలయ ముఖద్వారం, రాజగోపురాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. బ్రహ్మోత్సవాల ప్రారంభం సందర్భంగా ఎగువ అహోబిలంలో సెల్వార్ కూత్తు ఉత్సవాన్ని సోమవారం నిర్వహించారు. విష్వక్సేనుడిని పట్టుపీతాంబరాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి ఆలయం వెలుపలికి తీసుకువచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



నేడు అంకురార్పణ : ఎగువ అహోబిలంలో సాంప్రదాయబద్ధంగా అహోబిలేశుడి బ్రహ్మోత్సవాలకు మంగళవారం అంకురార్పణ చేయనున్నారు. దిగువ అహోబిలంలో సెల్వార్ కూత్తు ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. తన పెళ్లికి రావాలని భక్తులను ఆహ్వానించేందుకు స్వయంగా గ్రామాలకు వెళ్లి తిరిగి వచ్చిన దేవదేవుని బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. గత ఏడాది బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు దాదాపు 75 వేల మంది భక్తులు రాగా ఏ ఏడాది మరింత ఎక్కువ మంది వస్తారని నిర్వాహకుల అంచనా. ఈ మేరకు భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేపట్టారు.

సమస్యలన్నీ పరిష్కరిస్తాం

ఏఎస్పీ యుగంధర్ బాబు


ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఏఎస్పీ ఎన్.యుగంధర్‌బాబు

నంద్యాల క్రైం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తమ దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను చట్టపరిధికి లోబడి పరిష్కరిస్తామని ఏఎస్పీ యుగంధర్ బాబు పేర్కొన్నారు. సోమవారం నంద్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోలీస్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 72 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదులను ఏఎస్పీ యుగంధర్‌బాబు నేరుగా స్వీకరించారు. అందిన ఫిర్యాదుల్లో సివిల్ తగాదాలు, కుటుంబకలహాలు, అత్తారింటి వేధింపులు, అన్నదమ్ముల ఆస్తితగాదాలు ఉన్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి పరిష్కరిస్తామన్నారు. ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని, నిర్దీత గడువులోగా పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ దూరప్రాంతాల నుంచి జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేనివారు ప్రతి సోమవారం సమీప పోలీస్ స్టేషన్, సర్కిల్ ఆఫీస్, డీఎస్పీ కార్యాలయాల్లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. వాటిని కూడా పీజీఆర్ఎస్ ఫిర్యాదులుగానే పరిగణించి సకాలంలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు చేయడం లేదు

- తహసీల్దార్‌పై కలెక్టర్ అసహనం
- పీజీఆర్ఎస్‌లో 196 దరఖాస్తులు

నంద్యాల నూనెపల్లె, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): 'అమ్మా 713 రోజులు గడిచాయి.. ఇప్పటికీ తమ పొలాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయడం లేదని' బాధితుడు కలెక్టర్ ముందు మొరపెట్టుకున్నాడు. సంజామల మండలం కానాల గ్రామంలో పలు సర్వే నెంబర్లపై పూర్వీకులకు ఉన్న 4.48 ఎకరాల స్థలాన్ని ఆన్‌లైన్‌లో ఎక్కించడం లేదని, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాధితుడు కలెక్టర్ రాజకుమారికి ఫిర్యాదు చేశారు. దీంతో సంజామల తహసీల్దార్ వీసీలో వివరణ కోరారు. తహసీల్దార్ సమాధానంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. పొలాలు, స్థలాలకు సంబంధించిన ప్రక్రియపై రెవెన్యూ అధికారులు అలసత్వం విడనాడాలని హెచ్చరించారు. సోమవారం నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు సమస్యల పరిష్కారానికి వచ్చారు. 196 దరఖాస్తులను స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీ ఓపెన్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సరైన రీతిలో ఎండార్స్ చేయకపోవడంతో పదే పదే దరఖాస్తులు వస్తున్నాయని, వాటిపై దృష్టి పెట్టాలన్నారు. నంద్యాల, ఆత్మకూరు, డోన్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేల లాగిన్లలో 8, డోన్ ఆర్డీవో లాగిన్‌లో 4, డీఐజీ లాగిన్‌లో 3, డీఎస్ఓ లాగిన్‌లో 3, డీపీఓ లాగిన్‌లో రెండు దరఖాస్తులు రీ ఓపెన్ అయ్యాయని, క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్వో రాంనాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను జిల్లా వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు డీఈఓ జనార్ధన్ రెడ్డి తెలిపారు. జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. సాధారణ డ్రాఫ్ట్ సీనియారిటీ జాబితాను ఉపాధ్యాయ సమాచార వ్యవస్థ(టీఐఎస్) ఆధారంగా రూపొందించామన్నారు. జాబితాపై ఈనెల 10వతేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామన్నారు.

ఇక జాగ్రత్త



అంతకుమించి..!!


హెల్మెట్ లేకపోతే రూ.వెయ్యి జరిమానా


డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే రూ.10వేలు


కారులో అందరూ సీట్ బెల్టు పెట్టుకోవాల్సిందే


సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే రూ.10వేలు

ఆదోని, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు హెల్మెట్ విషయంలో పోలీసులు కఠినంగా వ్యవహరించనున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై ఏపీ హైకోర్టు ఇటీవల విచారణ నిర్వహించింది. ఈ క్రమంలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కఠినమైన నిబంధనలు అమలుకు శ్రీకారం చుట్టింది. ట్రాఫిక్‌ను ఉల్లంఘించి వాహనాలు నడిపే వారిపై భారీగానే జరిమానా విధించనున్నారు. మార్చి ఒకటో తేదీ నుంచి రూల్స్ మారాయి. ఇక నిబంధనలు అతిక్రమిస్తే భారీగానే జరిమానా చెల్లించుకోక తప్పదు. మార్చి ఒకటో తేదీ నుంచి రాష్ట్రంలో కొత్త మోటారు వెహికల్ చట్టం అమలు చేశారు. నూతన నిబంధనల ప్రకారం ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం తప్పనిసరి. హెల్మెట్ లేకపోయినా, ట్రాఫిక్ రూల్స్ పాటించకపోయినా భారీ జరిమానా విధించనున్నారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడుపుతూ పట్టుబడితే రూ.వెయ్యి జరిమానా విధిస్తారు. అంతేకాదు బైక్ వెనుక వైపు కూర్చున్న వ్యక్తి హెల్మెట్ ధరించకుంటే కూడా రూ.వెయ్యి ఫైన్ వేస్తారు. ఇక ఇన్సూరెన్స్ లేకుంటే రూ.2వేల నుంచి రూ.4 వేల వరకు జరిమానా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుంటే ఏకంగా రూ.5వేలు జరిమానా, పొల్యూషన్ సర్టిఫికెట్ లేకుంటే రూ.1,500 వరకు జరిమానా విధిస్తారు. ఆటో, లారీ డ్రైవర్లు యూనిఫాం ధరించకపోతే రూ.150 నుంచి రూ.300 వరకు ఫైన్ కట్టాల్సిందే. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే ఇప్పటివరకు రూ.1,500 ఉన్న జరిమానాను ఏకంగా రూ.10వేలకు పెంచారు. కారులో ప్రయాణించే వారికి కూడా నిబంధనలను కఠినతరం చేశారు. కారు డ్రైవర్‌తో పాటు, ప్రయాణికులు సీట్ బెల్టు ధరించకుంటే ఒక్కొక్కరికి రూ.వెయ్యి జరిమానా విధిస్తారు. రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుంటే రూ.2వేల నుంచి రూ.5వేల వరకు జరిమానా విధిస్తారు. అతివేగంతో వాహనం నడిపినా, బైక్‌పై ట్రిపుల్ రైడింగ్ చేసినా రూ.వెయ్యి జరిమానా ఉంటుంది. కారు, బైక్ రేసింగ్‌లకు పాల్పడితే రూ.5వేల నుంచి రూ.10వేల వరకు జరిమానా కట్టాల్సి ఉంటుంది.


తనిఖీలు చేస్తున్న అధికారులు

వాట్సాప్‌లో టెన్త్ హాల్ టికెట్

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు వాట్సాప్ ద్వారా కూడా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఈ క్రమంలో విద్యార్థులు తమ హాల్ టికెట్లను వాట్సప్ మనర మిత్ర ద్వారా లేదా అధికారిక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని డీఈఓ జనార్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ 3వతేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి వారి స్కూల్ లాగిన్ నుంచి కాని, ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన వాట్సాప్ మనమిత్ర ద్వారా కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వివరించారు. ప్రధానోపాధ్యాయులు హాల్‌టికెట్‌లోని విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, మాధ్యమం, ఫొటో, సంతకం వంటి అన్ని వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ధ్రువీకరించాలని ఆదేశించారు. విద్యార్థి వివరాలు సరిగా లేకపోతే సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ మెయిల్ ద్వారా కాని ప్రభుత్వ పరీక్షల సంచాలకుల దృష్టికి గాని తీసుకెళ్లాలని తెలియజేశారు.

వాట్సాప్ ద్వారా ఇలా..

1. వాట్సాప్ నుంచి 9552300009 అనే నంబర్‌కు 'హాయ్' అని పంపాలి.
2. 'సేవను ఎంచుకోండి' అని రాగానే తెలుగులో అయితే 'విద్యాసేవలు' ఇంగ్లీష్‌లో అయితే 'ఎడ్యుకేషన్ సర్వీస్'ను ఎంపికచేసుకోవాలి.
3. ఎస్ఎస్‌సీ హాల్‌టికెట్‌ను ఎంపిక చేసుకుని అప్లికేషన్ నంబర్ లేదా విద్యార్థి ఐడీ, పుట్టినతేదీ సంవత్సరం, నెలతో సహా వివరాలు నమోదు చేయాలి.
4. తర్వాత ఎస్ఎస్‌సీ హాల్‌టికెట్‌ను పొందేందుకు కన్ఫర్మ్ మీద క్లిక్ చేయాలి. వెంటనే హాల్‌టికెట్ డౌన్‌లోడ్ అవుతుంది. ప్రింట్ తీసుకుని పరీక్షా కేంద్రానికి వెళ్లవచ్చు.

సహాయానికి ఫోన్ నెంబర్లు

మహిళలు, విద్యార్థినులు, చిన్నారులు ఎక్కడైనా ఏదైనా ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటే తక్షణ సహాయం కోసం పోలీసులతోపాటు ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు హెల్ప్‌లైన్ నెంబర్లను సంప్రదించాలని పోలీస్ అధికారులు సూచిస్తున్నారు.

చైల్డ్ హెల్ప్‌లైన్‌కు - 1098
ఉమెన్ హెల్ప్‌లైన్ - 181
పోలీస్ హెల్ప్‌లైన్ - 100 / 112
సైబర్ క్రైం హెల్ప్‌లైన్ - 1930
నంద్యాల పోలీసు కంట్రోల్ రూమ్ (వాట్సాప్ నెంబర్) 91548 78120
ల్యాండ్ నెంబర్ - 08514 - 225097

తెలుసుకుందాం



మహిళలకు రక్షణ

- మహిళల భద్రతకు పోలీసులు
- జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం

నంద్యాల క్రైం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవలి కాలంలో మహిళలు, విద్యార్థినులపై వేధింపులు నానాటికీ పెరిగిపోతున్నాయి. ఈ పరిణామాలు అందరిలోనూ ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వారికి రక్షణ కవచంలా నిలిచేందుకు జిల్లా పోలీసులు నడుం బిగించారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్యక్రమాలు చేపట్టనున్నారు. కర్నూలు ఎస్పీ, నంద్యాల ఇన్‌చార్జి ఎస్పీ విక్రాంత్ పాటిల్, నంద్యాల ఏఎస్పీ మందా జావలి ఆల్ఫోన్స్ ఆదేశాల మేరకు మహిళల రక్షణ, భద్రతకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లలో ప్రత్యేకంగా ఓపెన్‌హౌస్ నిర్వహిస్తున్నారు. ఈ తరహా కార్యక్రమాలను ఈ నెల 8వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్వహించనున్నారు. మహిళలకు సంబంధించిన అంశాలపై పోటీలు, మెడికల్ క్యాంప్‌లు, ర్యాలీలు చేపట్టనున్నారు.


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సందర్శించండి.. తెలుసుకోండి..!

ఓపెన్ హౌస్‌లో భాగంగా మహిళలు, యువతులు, విద్యార్థినులను పోలీస్ స్టేషన్లకు ఆహ్వానించి పోలీస్ విధులు, మహిళా సహాయ కేంద్రం పనితీరు, అధికారుల పనితీరు, విధినిర్వహణలో ఉపయోగించే పరికరాలపై అవగాహన, విద్యార్థినుల సందేహాలను నివృత్తి చేయడం, మహిళలు, యువతులు, చిన్నారుల రక్షణకు రూపొందించి అమలు చేస్తున్న చట్టాలపై అవగాహన పోలీసులు కల్పించనున్నారు. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, పోక్సో యాక్టులతోపాటు సామాజిక మాధ్యమాల వినియోగం, వాటి దుష్పరిణామాలు, సైబర్ నేరాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు బాలికలు స్వీయరక్షణ పద్ధతులపై అవగాహన కల్పించనున్నారు.

విద్యార్థి కుటుంబానికి చెక్కు అందజేత


శ్రీలేఖ కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే, డీఈవో.

సి. బెళగల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి శ్రీలేఖ కుటుంబానికి కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కర్నూలు డీఈవో శ్యామ్యూల్‌పాల్ రూ.5 లక్షల చెక్కును అందజేశారు. ఆ కుటుంబంలోని మిగతా ఇద్దరు విద్యార్థులను ప్రభుత్వ గురుకుల పాఠశాలలో చేర్పించి చదివిస్తామని చెప్పారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీలేఖ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలాగే పాఠశాల ఆవరణలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాఠశాలలో ఉన్న చెట్ల కింద విద్యార్థులను చదివించడం, కుర్చోబెట్టడం చేయరాదన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమా, స్కూల్ చైర్మన్, మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్, మాజీ మండల కన్వీనర్ తిమ్మప్ప, మాజీ ఎల్లెల్సీ చైర్మన్ చిన్న కొండయ్య, నరసింహుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అప్పుల బాధతో కౌలు రైతు మృతి


రాంమోహన్ రెడ్డి (ఫైల్)

పాణ్యం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బలపనూరు గ్రామంలో యేలంపల్లి రాంమోహన్‌రెడి (63) అనే కౌలు రైతు అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సోమవారం జరిగింది. కుటుంబ సభ్యులు నంద్యాలకు పెళ్లికి వెళ్లడంతో.. పురుగుల మందు తాగాడు. దీంతో సమీపంలోని గ్రామస్తులు హుటాహుటిన నంద్యాల ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. గత పదేళ్లుగా పది ఎకరాలు కౌలు తీసుకొని పంటలు సాగు చేస్తున్నాడు. దాదాపు రూ.40 లక్షల అప్పులు పెరగడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని కుమారుడు గంగాధర్‌రెడ్డి, భార్య వరలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డిని తెలిపారు.

ట్రాక్టర్ నుంచి కిందపడి ఒకరు మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

ఆదోని రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ నుంచి జారి పడి ఒకరు మృతి చెందిన సంఘటన ఆదోని మండలంలో సోమవారం చోటు చేసుకుంది. ఇదే ఘటనలో మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఆదోనికి చెందిన వెంకటేశ్వర్లు(45) కూలి పనులు చేసుకునేవారు. రోజువారి పనుల్లో భాగంగా ఆయన ఆదోని మండలం విరూపాపురం గ్రామంలో ఓ మఠం నిర్మాణానికి ట్రాక్టరులో బండలను తీసుకొచ్చారు. అక్కడి నుంచి తిరిగి వెళ్తుండగా సోమవారం రాత్రి పది గంటల సమయంలో విరూపాపురం గ్రామ సమీపంలో స్పీడ్ బ్రేకర్ రావడంతో వాహనం అదుపు తప్పింది. దీంతో వెంకటేశ్వర్లుతో పాటు మరో కూలి కుమార్ ఇద్దరూ రోడ్డుపై పడ్డారు. వెంకటేశ్వర్లు తలపై ట్రాక్టర్ దూసుకెళ్లడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య గౌతమి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు. గాయపడ్డ కుమార్‌ను తోటి కూలీలు ఆసుపత్రికి తరలించారు.

సెట్కూర్ సీఈఓగా వేణుగోపాల్

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా సెట్కూర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(సీఈఓ)గా డాక్టర్ కె.వేణుగోపాల్ నియమితులయ్యారు. నంద్యాల జిల్లా కోవెలకుంట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న వేణుగోపాల్‌ను కర్నూలు జిల్లా యువజన సర్వీసుల శాఖ మరియు పర్యాటక, సాంస్కృతిక చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏడాది కాలం పాటు ఆయన పదవిలో కొనసాగుతారు.

పవర్ లిఫ్టింగ్‌లో జిల్లాకు పతకాలు

కర్నూలు స్పోర్ట్స్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని గాజువాకలో ఈనెల 1, 2 తేదీల్లో రాష్ట్ర స్థాయి పవర్‌లిఫ్టిగ్ పోటీలు జరి గాయి. జిల్లా లిఫ్టర్లు 18 పతకాలు సాధించారు. డీఎస్‌ఏ ఔట్‌డోర్ స్టేడియంలో విజేతలైన పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులను జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, పవర్ లిఫ్టింగ్ చైర్మన్ రామ్‌గోపాల్ అభినందించారు. విజేతలకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. పవర్ లిఫ్టింగ్ కార్యదర్శి లోకేశ్, జట్టు మేనేజర్ రేష్మా, పీఈటీ భాగ్య లక్ష్మి, ఉపాధ్యక్షులు మునిస్వామియా, అధ్యక్షుడు వేణుగోపాల్ విజేతలకు అభినందనలు తెలిపారు.

కలుషిత నీటి వల్లే మరణాలు..!

- కర్నూలు రీజనల్ సెంటర్ నుంచి వెల్లడైన నీటి నమూనాల నివేదిక
- నీలితొట్లవీధిలోని ఆర్వో ప్లాంట్ నమూనాల్లో ఈ-కోలీ బ్యాక్టీరియా
- వెంటనే ఆర్వో ప్లాంట్‌ను సీజ్ చేసిన అధికారులు

ఆత్మకూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కలుషిత నీటి వల్లే ఆత్మకూరు పట్టణంలోని నీలితొట్ల వీధిలో ఇద్దరు మృతి చెందినట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 27వ తేదీన నీలితొట్ల వీధికి చెందిన రహంతుల్లా(50), బషీరూన్ (60)తో పాటు మరికొందరు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురై ఆత్మకూరులోని ఆసుపత్రులను ఆశ్రయించారు. అయితే వీరిలో రహంతుల్లా, బషీరూన్ పరిస్థితి తీవ్రంగా ఉండటంతో వారిని కర్నూలుకు తరలించగా అక్కడ వారు కోలేకోలేక మరణించారు. దీంతో రాత్రికి రాత్రి అప్రమత్తమైన అధికార యంత్రాంగం యుద్ధప్రాతిపదికన నీలితొట్ల వీధిలో పారిశుధ్య చర్యలు చేపట్టారు. అన్ని తాగునీటి పైపులైన్లను పరిశీలించారు. పైపులైన్ల ద్వారా ఎక్కడా నీటి కలుషితం లేదని ప్రాథమికంగా గుర్తించారు. మార్చి 1వ తేదిన కాలనీలోని రెండు మినరల్ వాటర్ ప్లాంట్‌ను గుర్తించి అందులో ఫిల్టర్ చేసిన వాటర్‌తో పాటు రా వాటర్ నమూనాలను సేకరించి కర్నూలులోని రీజనల్ ల్యాబ్‌కు పంపించారు. అయితే సేకరించిన నీటి నమూనాల నివేదికలో సోమవారం పలు వాస్తవాలు వెలుగు చూశాయి. బిస్మిల్లా వాటర్ ప్లాంట్ నీటి నమూనాల్లో ఈ-కోలీ బ్యాక్టీరియా ఉన్నట్లు తేలింది. ఈ బ్యాక్టీరియా రా వాటర్‌లోకి చేరినట్లు గుర్తించారు. ఈ కలుషిత నీటిని సేవించడం వల్ల నీటితొట్ల వీధిలో అతిసార ప్రబలేందుకు కారణమని తెలుస్తోంది.

ఆర్వో ప్లాంట్‌ను సీజ్ చేసిన అధికారులు

నీటి నమూనాల పరీక్షల్లో వెల్లడైన నివేదికలతో నీలితొట్ల వీధిలో కలుషిత నీటికి కారణమైన బిస్మిల్లా వాటర్ ప్లాంట్‌ను సోమవారం సాయంత్రం అధికారులు సీజ్ చేశారు. ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి, తహసీల్దార్ రత్నరాధిక, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబులు వాటర్ ప్లాంట్ యజమాని ఖుర్షిద్‌కు నోటీసులు జారీ చేసి వాటర్ ప్లాంట్‌ను మూసివేశారు. ఇంకా పట్టణంలోని సుమారు 19 వాటర్ ప్లాంట్లకు సంబంధించి నీటి నమూనాలను కూడా మున్సిపల్ అధికారులు సేకరించారు. ముందు జాగ్రత్తల్లో భాగంగా వాటిని కూడా రీజనల్ ల్యాబ్‌కు పంపించగా త్వరలోనే ఆ రిపోర్టులు కూడా రానున్నాయి. అదే క్రమంలో కాలనీకి పైపులైన్ల ద్వారా నీటి సరఫరా చేపట్టకుండా ప్రత్యేక ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. అలాగే 24 గంటలపాటు కాలనీలో వైద్యసేవలను అందుబాటులో ఉంచారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలను చేపడుతున్నారు. అలాగే యుద్ధప్రాతిపదికన కాలనీలోని పాత పైపులైన్ తొలగించి కొత్త పైపులైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.


సోమవారం నీలితొట్లవీధిలో పర్యటించిన అధికార యంత్రాంగం

న్యాయం చేయాలంటూ

పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించిన బాధితులు



ఆందోళన చేస్తున్న బాధితులు

చాగలమర్రి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రిలోని న్యూ బిల్డింగ్స్ వీధిలో నాలుగేళ్ల క్రితం ఏర్పాటు చేసిన జనని మ్యాక్స్ లిమిటెడ్ ప్రైవేటు సంస్థ ఏర్పాటు చేశారు. డబ్బులు చెల్లిస్తే వడ్డీతో పాటు మూడు రెట్లు అదనంగా చెల్లిస్తామంటూ ప్రజలకు మాయమాటలు చెప్పి రూ.40 లక్షలు దాకా డబ్బు కట్టించుకొని కాలయాపన చేస్తున్నారని సోమవారం ఆ సంస్థ కేంద్రం ముందు బాధితులు ఆందోళన చేపట్టారు. తాము చెల్లించిన సొమ్ముకు మూడు రెట్లు అదనంగా చెల్లిస్తామని మోసం చేశారని బాధితులు వాపోయారు. నెల రోజుల నుంచి డబ్బుల కోసం తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని అన్నారు. చాగలమర్రిలో రూ.10 లక్షలు, బ్రాహ్మణపల్లెలో రూ.30 లక్షలు దాకా బాధితులు చెల్లించామన్నా రు. సంస్థ మేనేజర్ కేంద్రానికి రాకపోవడంతో బాధితులు కట్టిన డబ్బులు వస్తాయో లేదోనని ఆవేదన చెందుతున్నారు. న్యాయం చేయాలంటూ బాధితులు పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. పోలీసులు స్పందించి విచారణ జరిపి డబ్బులు వచ్చేలా చూస్తామని పోలీసులు పేర్కొన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని కొండవీటి ప్రాంతానికి చెందిన యుయు సందీప్ (25) అప్పుల బాధలు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడు. కొండవీటి ప్రాంతవాసి సందీప్ బైక్ మెకానిక్‌గా జీవిస్తున్నాడు. బైక్ మెకానిక్ పనుల వల్ల వచ్చే ఆదాయం కుటుంబ పోషణకు సరిపోవడం, సంతానం కలగకపోవడం వల్ల మనస్తాపం చెంది ఆదివారం అర్థరాత్రి ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు పరిశీలించి తెలపారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నాటుసారాను సమూలంగా నిర్మూలించాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా మార్చడమే.. నవోదయం 2.0 కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఆ దిశగా జిల్లాలో సమూలంగా నాటుసారాను నిర్మూలించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నాటుసారా నిర్మూలనా కార్యక్రమం నవోదయం 2.0పై రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాటుసారా వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి ప్రజల్లో విస్తృత అవగాహన పెంచాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎక్కడైనా నాటుసారా, అక్రమ మద్యం, గంజాయి, సరఫరా వంటి సమాచారం తెలిస్తే టోల్‌ఫ్రీ నెం.14405ను కాల్ చేసి తెలియజేసి జిల్లాను నాటుసారా రహితంగా మార్చడంలో తమ వంతు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో వెంకట నారాయణమ్మ, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ కుమార్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐ ఇంద్రకరణ్ తేజ, హెడ్ కానిస్టేబుల్ సాయిబాబా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బ్యాంకులో చోరీకి విఫల యత్నం

ఎమ్మిగనూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ఉన్న కెనరా బ్యాంకు (ఓల్డ్ సిండికేట్ బ్యాంకు)లో గుర్తు తెలియని వ్యక్తి చోరీకి విఫలయత్నం చేశాడు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. ఆదివారం అర్ధరాత్రి ఓ దొంగ కిటికీని పగులగొట్టి బ్యాంకులో చొరబడ్డాడు. లోపల కౌంటర్ దగ్గర డబ్బు లభించకపోవడంతో బ్యాంకులో ఉన్న సేఫ్ లాకర్ దగ్గరకు వెళ్లి లాకర్ తెరిచేందుకు యత్నించాడు. అయితే అది తెరుచుకోకపోవడంతో చేసేదిలేక పక్కనే ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉన్న టీ స్టాల్‌లోని డబ్బుల కౌంటర్‌ను పగులగొట్టి అందులో ఉన్న రూ.1500 దోచుకెళ్లాడు. బ్యాంకు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు బ్యాంకును పరిశీలించారు. నగదు చోరీకి గురికాకపోవడంతో బ్యాంకు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి పడి ఒడిసా వాసి మృతి

తుగ్గలి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రైలులో ప్రయాణిస్తున్న రథియా బాడెక్ (33) అనే వ్యక్తి మృతి చెందాడు. సోమవారం మండల పరిధిలోని లింగనాయనదొడ్డి రైల్వేస్టేషన్ సమీపంలో వెళ్తున్న రైలు నుంచి కింద పడి ఒడిసాకు చెందిన రథియా బాడక్ మృతి చెందాడు. డోన్ రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం డోన్ ఆసుపత్రికి తరలించారు. అతని వద్ద ఉన్న ఆధార్‌కార్డ ద్వారా మృతుడు వివరాలు తెలుసుకున్నారు. ఆయన ఒడిసా నుంచి గదక్ వెళ్తున్నట్లు తెలిపారు. మృతుడు ప్రమాదవశాత్తు రైలు నుంచి పడ్డాడా? లేక ఎవరైనా వెనుకనుంచి తోసేశారా? అనే అనుమానం నివృత్తి కావాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

డిగ్రీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలకు 170 మంది హాజరు

కర్నూలు అర్బన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): డిగ్రీ స్పెషల్ సప్లమెంటరీ పరీక్షలకు 207 మంది దరఖాస్తు చేసుకోగా 170 మంది హాజరైనట్లు పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని రాయలసీమ వర్సిటీ పరిధిలోని 14 కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని పేర్కొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చూడండి

ప్రణాళికలు రూపొందించాలి : కలెక్టర్ రాజకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తాగునీటి ఎద్దడి లేకుండా పటిష్ట ప్రణాళికలు రూపొందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. వేసవిలో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు బోర్‌వెల్స్ డీపనింగ్, ఫ్లషింగ్, పైప్‌లైన్ల మరమ్మతులు చేపట్టాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది చేపట్టిన పీ-4సర్వే 15 శాతం పెండింగ్‌లో ఉందని, వాటిని వెంటనే పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం ఆహార పదార్థాలు అందించాలన్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధిపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె చర్చించారు. జేసీ విష్ణుచరణ్ మాట్లాడుతూ రెవెన్యూ పరంగా భూ సమస్యల పరిష్కారానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న రీ సర్వే, మ్యుటేషన్ దరఖాస్తుల పరిష్కారానికి ఆర్డీవోలు, తహసీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.

● ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సర్వీస్ ట్యాక్స్ సరైన పద్దుకు జమ చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈఎస్ఐ సర్వీస్ ట్యాక్స్ ఏ పద్దు కింద జమ అవుతుందనే అంశాలపై జిల్లా అధికారులకు అవగాహన ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఈఎస్ఐ కార్పొరేషన్ బ్రాంచ్ మేనేజర్ దుర్గాప్రసాద్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల నియామకాలకు సంబంధించి వారిని ఈఎస్ఐలో నమోదయ్యే విషయాలపై అవగాహన కల్పించారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా కలెక్టరేట్ ఆవరణలోని పీజీఆర్ఎస్ ఆవరణలో బాల్య వివాహాల నిర్మూలనకు సంతకాల సేకరణ చేపట్టారు. కలెక్టర్ రాజకుమారి, జేసీ విష్ణుచరణ్, వివిధ శాఖల జిల్లా అధికారులు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా కృషి చేయాలని, జిల్లా, డివిజన్, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పీజీఆర్ఎస్‌లో దరఖాస్తు చేసుకున్న ఐదుగురు దివ్యాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. డిగ్రీ తదితర విద్యనభ్యసిస్తున్న మానసిక దివ్యాంగులకు రూ.30 వేల విలువ చేసే ల్యాప్‌టాప్‌లను ఆరుగురికి ఆమె అందజేశారు.

ఘనంగా ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలు



శ్రీశైలంలో టెంకాయలు కొడుతున్న టీడీపీ శ్రేణులు



బండిఆత్మకూరులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు



సున్నిపెంటలో రోగులకు బ్రెడ్లు పంపిణీ చేస్తున్న నాయకులు



మహానందిలో..



ఆత్మకూరు ప్రభుత్వాసుపత్రిలో మొక్కలు నాటుతున్న దృశ్యం



వెలుగోడులో..

సున్నిపెంట, మార్చి 3(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి పుట్టిన రోజు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మొదట భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తరువాత ఆలయ ప్రధాన ద్వారం వద్ద కొబ్బరి కాయలు సమర్పించారు. అనంతరం నంది సర్కిల్ వద్ద సాధువులు, పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో శ్రీశైలం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి ఉడవల్లి శ్రీనివాసరెడ్డి, బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు చదువుల శ్రీను, జనసేన నియోజక వర్గం ఇన్‌చార్జి రౌతు అశోక్ కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

● ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా సున్నిపెంటలోని టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. తరువాత సున్నిపెంటలోని ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

● **ఆత్మకూరు:** శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఆ పార్టీ ఆత్మకూరు మండల నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ప్రత్యేకించి ఆయా గ్రామాల్లో మొక్కలు నాటి, కేక్ కట్ చేశారు. అదేవిధంగా ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ మండలాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ అనునిత్యం ప్రజల సంక్షేమాన్ని కాంక్షించే తమ నేత బుడ్డా రాజశేఖరరెడ్డి ఇలాంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపుకోవాలని అన్నారు. ఎమ్మెల్యే బుడ్డా జన్మదిన వేడుకలను పురస్కరించుకుని అన్నదాత కార్యక్రమాలు, మొక్కలు నాటడం, రోగులకు పండ్ల పంపిణీ తదితర సామాజిక కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాయుడు, నాయకలు పుల్లారెడ్డి, నబిరసూల్, స్వామిరెడ్డి, లింగస్వామి, శివప్రసాద్, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు. ఇదిలావుంటే ఆత్మకూరు పట్టణంలోని నీలితొట్ల వీధిలో సంభవించిన అతిసార కారణాలతో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను టీడీపీ శ్రేణులు రద్దు చేశారు.

● **బండిఆత్మకూరు:** ప్రతి ఒక్కరం పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని కేసీ కెనాల్ ప్రాజెక్టు అభివృద్ధి కమిటీ చైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పెద్దదేవళాపురంలో పర్యావరణ ప్రేమికుడు మలిరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి 58వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేశారు. అనంతరం జామ, నిమ్మ మొక్కలను వారు పంపిణీ చేసి సచివాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో తెలుగు గంగ కాల్వ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కంచర్ల మనోహర్ చౌదరి, మండల టీడీపీ అధ్యక్షుడు నందిపాటి నరసింహారెడ్డి, టీడీపీ నాయకులు చిన్న లింగారెడ్డి, మల్లేశ్వరరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

● **మహానంది:** శ్రీశైలం నియోజక వర్గం టీడీపీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకొని మహానంది మండల టీడీపీ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. సోమవారం మహానంది సమీపంలోని ఒక ఫంక్షన్ హాలులో ఎమ్మెల్యే జన్మదినం పురష్కరించుకొని కేక్ కట్ చేశారు. అనంతరం మహానంది క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసరాల్లో వివిధ రకాల మొక్కలను నాటారు.

వెలుగోడు: ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలను టీడీపీ కార్యాలయంలో సోమవారం కూటమి నాయకులు ఘనంగా నిర్వహించారు. కూటమి నాయకులు కేక్ కట్ చేసి పంచి పెట్టారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో కూటమి నాయకులు మొక్కలు నాటారు. ప్రభుత్వ అసుపత్రిలో రోగులకు బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శేషిరెడ్డి, కలాం, ఖలీల్, జాకీర్, శంకర్ రెడ్డి, రాము, భూపాల్ చౌదరి, హుసేన్, జనసేన నాయకులు షాలుబాషా, బీజేపీ నాయకులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉచితంగా గ్రైండర్ల పంపిణీ



గ్రైండర్లు, తోపుడు బండిని అందజేస్తున్న దృశ్యం

నంద్యాల కల్చరల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు, భవనాశి చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు భవనాశి నాగమహేష్ పేద ఆర్యవైశ్యులకు గ్రైండర్లు, తోపుడు బండ్లు ఉచితంగా అందజేశారు. నంద్యాలలో సోమవారం భవనాశి చారిటబుల్ ట్రస్టు ద్వారా వెలుగోడు మండలానికి చెందిన నిరుపేద ఆర్యవైశ్యులకు 70 వేల రూపాయల విలువగల మూడు గ్రైండర్లు, తోపుడు బండ్లు అందిచారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఖండే శ్యామ్ సుందర్ లాల్, వెలుగోడు మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు సత్యం, బింగుమళ్ల శ్యామ్‌సుందర్‌గుప్త, బిజెపి చంద్రశేఖర్, గాంధీ, జిల్లా ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరిదేవి విగ్రహ ప్రతిష్ఠ



చౌడేశ్వరిదేవికి పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు

పాములపాడు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పాములపాడు గ్రామ పొలిమేర చౌడేశ్వరిదేవి నూతన ఆలయం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, శాస్త్రోక్తంగా పురోహితులు నిర్వహించారు. సోమవారం నియోజకవర్గం టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పురోహితులు మాట్లా డుతూ ప్రాతఃకాల పూజలు, యంత్రాలు, అభిషేకాలు, ప్రతిష్ఠ హోమాలు, యంత్ర ప్రతిష్ఠ, అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, బలి హరణం, మహాపూర్ణాహుతి, మహామంగళ హారతి తదితర పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకులు ఆళగడ్డ హరిసర్వోత్తమ రావు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

తేనెటీగలతో పంట ఉత్పత్తుల పెరుగుదల



తేనెటీగల పెంపకం శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ డాక్టర్ శబరి

పాణ్యం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తేనెటీగల పెంపకంతో పంట ఉత్పత్తులు పెరుగుతాయని నంద్యాల ఎంపీ డాక్టర్ శబరి అన్నారు. సోమవారం బలపనూరు సమీపంలో ఉచిత తేనెటీగల పెంపకం కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. రైతులకు, విద్యార్థులకు, యూనివర్సిటీ విద్యార్థులకు ఈ కేంద్రంలో ఉచితంగా తేనెటీగల పెంపకంపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పంటల పూతను పెంచేలా కృషి చేసే తేనెటీగలు అంతరించకుండా కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. తేనెటీగల పెంపక శిక్షకులు వెలుగు రమేష్, ఇలియాజ్ బాషా, జ్ఞానేశ్వర్‌గౌడ్‌లు ఏడేళ్లుగా వ్యవసాయానికి తోడ్పాటునందించడం అభినందించదగినదన్నారు. కార్యక్రమంలో టెలికాం అడ్వయిజరీ కమిటీ సభ్యుడు శ్రీనివాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికను పరిరక్షించండి



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రుద్రవరం మండలం ముత్తులూరు గ్రామస్థులు

నంద్యాల నూనెపల్లె, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం మండలం ముత్తులూరు గ్రామంలోని హిందూ శ్మశానవాటిక స్థలాన్ని ఆక్రమణ దారులనుంచి పరిరక్షించాలని గ్రామ పెద్దలు వెంకటరాముడు, కృష్ణారెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు డిమాండ్ చేశారు. సోమవారం నంద్యాల కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి కలెక్టర్ రాజకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గతంలో శ్మశానానికి సంబంధించి ప్రభుత్వం పోరంబోకు స్థలాన్ని మంజూరు చేసిందని, రానురాను శ్మశానవాటిక చుట్టూ ఉన్న పొలందారులు ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకొని శ్మశానవాటిక స్థలాన్ని పరిరక్షించాలని వారు డిమాండ్ చేశారు. సంబంధిత సమస్యపై ఆ మండల తహసీల్దార్ మల్లికార్జునతో కలెక్టర్ మాట్లాడి పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు.

సైనికులకు ఉచిత వైద్య సేవలు

నంద్యాల హాస్పిటల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మధుమణి నర్సింగ్‌హోంలో ఉచిత వైద్య సేవా కార్యక్రమాన్ని ఎంపీ డా.బైరెడ్డి శబరి ప్రారంభించారు. ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా నంద్యాల ఐఎంఏ అధ్యక్షుడు డా.మధుసూదన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ శబరి, టీడీపీ నాయకు లు ఎన్ఎండీ ఫయాజ్, ఐఎంఏ మాజీ అధ్యక్షుడు డా.రవికృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పుట్టుకతో వచ్చే వినికిడి సమస్యకు మధుమణి ఆస్పత్రిలో కాంక్లియా ర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్స గురించి డా.చిత్తలూరి మణిదీప్ వివరించారు. ఎంపీ మాట్లాడుతూ దేశంలో సైనికులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత ఓపీడీ సేవలు అందిం చేందుకు ముందుకు రావడం విశేషమని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు ఎన్ఎండీ ఫయాజ్, ఐఎంఏ కార్యదర్శి డా.ఫనిల్ కుమార్, డా.సహదేవుడు, డా.నాగమణి, డా.మాధవి, డా.కార్తీక్, డా.పెసల సునీత, డా.మస్తానయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ పసికందు మృతి

● ఆస్పత్రి వద్ద బంధువుల ఆందోళన

నంద్యాల హాస్పిటల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని మధు చిన్న పిల్లల ఆస్పత్రిలో పసికందు మృతి చెందడంతో బంధువులు ఆందోళకు దిగారు. నంద్యాల మండలం బిళ్లలాపురం గ్రామానికి చెందిన వెంకట రామాంజనేయులు, హరిత దంపతులు ప్రసవం కోసం జాబిల్లి ఆస్పత్రికి వెళ్లారు. గత నెల 9వ తేదీన హరిత మగ బిడ్డకు జన్మనిచ్చింది. 7వ నెలలో ప్రసవం జరగడంతో జాబిల్లి ఆస్పత్రి వైద్యులు చికిత్స కోసం వేరే ఆస్పత్రికి వెళ్లమని సూచించారు. అదే రోజు మధు చిన్న పిల్లల ఆస్పత్రిలో చేర్చారు. పసికందును ఐసీయూలో 22 రోజులుగా ఉంచి చికిత్స నిర్వహించారు. సోమవారం డిశ్చార్జి చేస్తారన్న సమయంలో శిశువు మృతిచెందడంతో ఆందోళనకు దిగారు. పోలీసులు ఆస్పత్రి వర్గాలతో చర్చించి పరిస్థితిని అదుపుచేశారు. అయితే కార్డియాక్ అరెస్టతో మృతిచెందాడని డాక్టర్ రాకేష్ తెలిపాడు.

బంధువులకు వృద్ధురాలి అప్పగింత



వృద్ధురాలిని బంధువులకు అప్పగిస్తున్న పోలీసులు

సున్నిపెంట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం పోలీసులు సోమవారం 70 సంత్సరాల వృద్ధురాలిని వారి బంధువులకు అప్పగించారు. తెలంగాణ రాష్ట్రం మెదక్ జిల్లా, బడివి తాలూక, తాండూరు గ్రామానికి చెందిన బాసమ్మ(70) శివరాత్రి ఉత్సవాల సందర్భంగా శ్రీశైలంలో తప్పిపోయింది. శ్రీశైలం సీఐ జి.ప్రసాదరావు, దేవస్థానం ఈఈ బాలమురళీకృష్ణ వృద్ధురాలు ఆచూకీ కనుగొని సోమవారం వారి బంధువులకు అప్పగించారు.

మసీదుపురంలో నీటి సమస్యకు పరిష్కారం

మహానంది, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం మసీదుపురం ఎస్సీ కాలనీలో నీటి సమస్యను పరిష్కరించారు. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి స్పందించి అధికారులకు ఫోన్ ద్వారా చెడిపోయిన బోరుకు మరమ్మతులు చేయించారు. దీంతో గ్రామస్థుల కు సోమవారం తాగు నీరు అందుబాటులోకి వచ్చింది.

బాధిత రైతుకు ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయాన్ని అందిస్తున్న అబ్దుల్లాపురం టీడీపీ నాయకులు

వెలుగోడు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వెలుగోడు మండలం అబ్దుల్లాపురం గ్రామంలోని జగ్గల జగదీష్‌కు చెందిన 25 బండ్ల గడ్డివాము ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి ఆదివారం కాలి బూడిదయింది. ఈ విషయం స్థానిక టీడీపీ నాయకులు రఘుస్వామిరెడ్డి, రామలింగారెడ్డి, రమణారెడ్డిలు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రైతు జగదీష్‌కు 20 వేల రూపాయల ఆర్థిక సహాయంతో పాటు ఐదు ఎకరాల గడ్డిని ఆ రైతుకు ఉచితంగా ఇవ్వాలని ఎమ్మెల్యే స్థానిక నాయకులకు ఆదేశించారు. దీంతో ఆర్థిక సహాయాన్ని, 5 ఎకరాల గడ్డిని సోమవారం టీడీపీ నాయకులు బాధిత రైతు కుటుంబానికి అందజేశారు. రైతు జగదీష్ ఎమ్మెల్యే బుడ్డారాజశేఖరరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

యోగాతో మానసిక స్థైర్యం: ఏఎస్పీ



యోగా చేస్తున్న అడిషనల్ ఎస్పీ మందా జావలి ఆల్ఫోన్స్

నంద్యాల క్రైం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): యోగాతో ఒత్తిడిని జయించి మానసిక స్థైర్యం పెంపొందించుకోవచ్చని అడిషనల్ ఎస్పీ మందా జావలి ఆల్ఫోన్స్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవా న్ని పురస్కరించుకొని జిల్లా పోలీస్ కార్యాలయ మైదానంలో సోమవారం మహిళా పోలీసులకు ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ ఆల్ఫోన్స్ మాట్లాడుతూ మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణించాలని అన్నారు. మహిళల హక్కులు, సమానత్వం, భద్రత, రక్షణకు పోలీస్ శాఖ నిర్విరామంగా విధులు నిర్వర్తిస్తోందని గుర్తు చేశారు. మహిళల స్వీయరక్షణ సామర్థ్యాన్ని పెంపొందించడానికి వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

వినికిడి లోపాలపై అవగాహన



ర్యాలీ చేస్తున్న ప్రభుత్వ వైద్యులు

నంద్యాల హాస్పిటల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా నంద్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం వినికిడి లోపాలకు గల కారణాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. వెంకటరమణ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ పిల్లలు బలపాలు, పెన్నులు, పెన్సిళ్లు, పిన్నీసులు చెవుల్లో పెట్టి తిప్పడంవల్ల కర్ణభేరి దెబ్బ తగిలి చెవుడు వచ్చే ప్రమాదం ఉందన్నారు. చెవులకు సంబంధించిన సమస్యలు వచ్చినప్పుడు వెంటనే సంబంధిత వైద్య నిపుణులను సంప్రదించి చికిత్స పొందాలన్నారు. సొంత వైద్యం, నాటు వైద్యం పద్ధతులు పాటించవద్దని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డా.కాంతరావునాయక్, ఎన్‌హెచ్ఎం జిల్లా అధికారి డా.అంకిరెడ్డి, ఎంసీహెచ్ అధికారి డా.ప్రసన్నలక్ష్మి, డెమో రవీంద్రనాయక్, సుజాత, గురప్ప, శివరాం, జగదీష్, హరినాథ్‌రెడ్డి, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల పరిశీలన



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక విద్యా పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటర్ పరీక్షలను జిల్లా విద్యాశాఖాధి కారి జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు. జిల్లాలో ఐదు పరీక్షా కేంద్రాల్లో సోమవారం ఇంగ్లీష్ పరీక్షను నిర్వహించారు. 697 మంది విద్యార్థులకు గాను 649 మంది విద్యార్థులు హాజరుకాగా 48 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా నంద్యాల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాన్ని డీఈవో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరీక్షల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఫ్లయింగ్ స్క్వాడ్, అన్ని పరీక్షా కేంద్రాలకు సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామని చెప్పారు.

ఇళ్ల స్థలాలు ఇచ్చి పేదలను ఆదుకోండి



ఆత్మకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ శ్రేణులు

ఆత్మకూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేసి ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు, నాయకులు రమేష్, ప్రతాప్‌లు అన్నారు. సోమవారం స్థానిక గౌడ్ సెంటర్ నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు లబ్ధిదారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన పేదలకు రెండు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని అన్నారు. లేనిపక్షంలో ఎర్రజెండా పాతి మూడు సెంట్ల చొప్పున ఆక్రమిస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ రత్నరాధికకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వెంకటశివుడు, అహ్మద్‌హుసేన్, బాషా, ఏసేపు, ముర్తుజాబీ, స్వాతి, షేక్షావలి, ఖాదర్ ఉన్నారు.

ఉపాధ్యాయ సంఘాల హర్షం

ఆత్మకూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసులు నాయుడు విజయం సాధించడం పట్ల ఆత్మకూరులోని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కమతం శంకర్, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చాంద్‌బాషా, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు శివప్రసాద్‌ల నేతృత్వంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నూర్‌మహ్మద్, సయ్యద్‌ఇబ్రహీం, హుసేన్ సాహెబ్, దామరేకుల రవి, రామిరెడ్డి, ప్రదీప్, హనుమంతు, ఉమ్మర్, బాలాజీనాయక్, శోభన్ తదితరులు ఉన్నారు.

నంద్యాల ఎడ్యుకేషన్: గాదె శ్రీనివాసులు విజయం పట్ల నంద్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామపక్కీరారెడ్డి, సయ్యద్ చాంద్‌బాషాలు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ఉపాధ్యాయులకు వారధిగా ఉంటూ పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

వన్యప్రాణుల సంరక్షణ మనందరి బాధ్యత

కొత్తపల్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అంతరించిపోతున్న వన్యప్రాణులను సంరక్షించడం మనందరి బాధ్యత అని యాంటి పోచింగ్ రేంజ్ అధికారి రామకోటి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ వణ్యప్రాణుల సంరక్షణ దినోత్సవం ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ జ్యోతి స్వరూప్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాలలో విద్యార్థులకు అంతరించిపోతున్న వన్యప్రాణులు, వాటి సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరంచారు. అనంరతం పాఠశాల నుంచి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆఫీసర్లు శివనాగయ్య, మహేశ్వరమ్మ, హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శానిటేషన్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నంద్యాల నూనెపల్లె, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీలోని శానిటేషన్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి శివబాలకృష్ణ, పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు నంద్యాలలోని నూనెపల్లె నుంచి మున్సిపల్ కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు ర్యాలీ చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం చిత్తశుద్ధితో పరిష్కరించాలని కోరారు. అనంతరం కలెక్టర్ రాజకుమారికి వినతిపత్రం అందజేశారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

నంద్యాల క్రైం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా నంద్యాల జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ విక్రాంత్ పాటిల్, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎన్.యుగంధర్‌బాబు ఆదేశాల మేరకు నంద్యాలలోని విద్యాసంస్థల్లో సోమవారం మహిళల సాధికారత, హక్కులు, సమానత్వం అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోక్సో యాక్ట్, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, సైబర్ క్రైం, రోడ్డు ప్రమాదాలు, మహిళలపై జరిగే నేరాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

రేకుల షెడ్లు ఏర్పాటు చేస్తాం



చాగలమర్రిలో దగ్ధమైన పూల అంగళ్లను పరిశీలిస్తున్న ఈవోఆర్డీ, టీడీపీ నాయకులు

చాగలమర్రి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని పాత బస్టాండులో రేకుల షెడ్లతో పూల అంగళ్లు ఏర్పాటు చేస్తామని ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్ అన్నారు. సోమవారం దగ్ధమైన పూల అంగళ్లను టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవోఆర్డీ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ స్థలంలో గత కొన్నేళ్లుగా ఏర్పాటు చేసుకున్న పూల అంగళ్లు దగ్ధమయ్యాయన్నారు. దుకాణదారులకు నష్టం వాటిల్లడం బాధాకరం అన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్లాట్‌ఫారం లేదా పక్కా గదుల నిర్మాణాలు చేపట్టే విషయంపై తగు నిర్ణయం తీసుకుంటామని అన్నారు. అంతవరకు వ్యాపారులు ఎటువంటి దుకాణాలు ఏర్పాటు చేయరాదని సూచించారు. అగ్నిప్రమాదంలో కాలిపోయిన అంగళ్లను తొలగింపు చేసి కొత్తగా నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, టీడీపీ నాయకులు కొలిమి ఉసేన్‌వలి, మౌలాలి, అనిఫ్, బాధితులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న తోటి మిత్రులు

రుద్రవరం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : స్నేహితుడికి కుటుంబానికి తోటి మిత్రులు అండగా నిలిచారు. 2007లో పదో తరగతి విద్యను రుద్రవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో రెడ్డిపల్లె గ్రామానికి చెందిన నాగశేషు విద్యనభ్యసించాడు. ఇటీవల అనారోగ్యంతో ఆయన మృతి చెందాడు. దాంతో స్పందించిన తోటి మిత్రులు సోమవారం బాధిత కుటుంబానికి రూ. 51,500 ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మహేశ్వర్‌రెడ్డి, ఖాసిం, సురేంద్ర తదితరులు ఉన్నారు.

రజకులకు దోబీఘాట్‌లు నిర్మించాలి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 3(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రజకుల ప్రయోజనార్థం నూతన దోబీఘాట్‌లను నిర్మించాలని అఖిల భారత రజక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, ఉపాధ్యక్షుడు అమడాల రమణ కోరారు. నంద్యాలలోని కలెక్టరేట్ ఆవరణలో ఉన్న పీజీఆర్‌ఎస్ భవనంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ రాజకుమారికి సోమవారం వారు వినతిపత్రం అందజేశారు. గతంలో నిర్మించిన దోబీ ఘాట్‌లు శిథిలావస్థలకు చేరుకుంటుండడంతో వాటికి మరమ్మతులు చేయించడంతో పాటు నూతన ఘాట్‌లు మంజూరు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు కంబగిరి, ఆదినరసింహుడు పాల్గొన్నారు.

ఇది ప్రజా బడ్జెట్ : డోన్ ఎమ్మెల్యే

డోన్ రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ హయాంలో ప్రవేశ పెట్టిన తొలి బడ్జెట్‌లో ప్రజల ఆకాంక్షలకు పెద్దపీట వేశారని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సోమవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన విధ్వంసం నుంచి వ్యవస్థలను పునర్నించడానికి సీఎం చంద్ర బాబు నాయుడు కృషి చేస్తున్నారన్నారు. ప్రాంతీయ అసమానతలను అధికమించేలా అభివృద్ధి వికేంద్రీకరణకు ప్రాధాన్యం ఇచ్చేలా రూపొందించిన బడ్జెట్ జనరంజకంగా ఉందన్నారు. పేదలకు, రైతులకు మేలు చేసే బడ్జెట్ అని కొనియాడారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఉయ్యాలవాడ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని హరివరం గ్రామంలో ఆత్మహత్యాయత్నం చేసిన కోయిల మేరి(23) సోమవారం మృతి చెందింది. మేరి కడుపు నొప్పితో బాధపడుతూ ఫిబ్రవరి 27వ తేదీన పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి కర్నూలు పట్టణ వైద్యశాల తరలించారు. వైద్యశాలలో చికిత్స పొందు తూ కోలుకోలేక ఆదివారం మృతి చెందినట్లు మేరీ తల్లి రాజమ్మ తెలి పింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలి పారు. మృతురాలికి భర్త బాబు, మూడేళ్ల కూతురు, కుమారుడు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించనివారికి జరిమానా

ట్రాఫిక్ నిబంధనలు పాటించని 10 మందిపై కేసు నమోదు చేసి రూ. 3,130 జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు. వాహనదారులకు లైసెన్స్, ఆర్‌సీ, ఇన్సూరెన్స్ తప్పక ఉండాలన్నారు.

యాప్‌ల భారం తగ్గించాలి



ఆర్డీవోకు వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

డోన్ రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్లపై యాప్‌ల భారం తగదని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జులైఖ అన్నారు. సోమవారం డోన్ ఆర్డీవో నరసింహులును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జులైఖ మాట్లాడుతూ యాప్‌ల ద్వారా అంగన్‌వాడీ వర్కర్లకు పనిభారం పెరుగుతుందని యాప్‌ల బాధ్యతను తగ్గించాలని కోరారు.

ఇళ్ల మంజూరుకు అనుబంధపట్టా తప్పనిసరి

ప్యాపిలి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఇళ్ల మంజూరుకు అనుబంధ పట్టాతో పాటు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా అవసరమని హౌసింగ్ ఏఈ వెంకటేష్ తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆయన వీఆర్వోలతో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వీఆర్వోలు సోమశేఖర్‌నాయుడు, మహేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

కొలిమిగుండ్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : కొలిమిగుండ్ల పాత తహసీల్దారు కార్యాలయం ఆవరణంలో ఐ-మిత్ర కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో మంగళవారం కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కంటి వైద్య సహాయ నిపుణులు పులిపాటి గోపాల్ సోమవారం వెల్లడించారు. కంటి పరీక్షలు నిర్వహించి, శస్త్రచికిత్స అవసరమైన వారిని గుర్తించి, కడప పుష్పగిరి ఆసుపత్రిలో ఆపరేషన్లు చేయిస్తామన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వృద్ధులు, కంటి చూపు మందగించిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేటి నుంచి గ్రామాల్లో సామాజిక తనిఖీలు

కోవెలకుంట్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : నేటి నుంచి గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం పర్యటించి పనులు పరిశీలిస్తారని ఎంపీడీవో వర ప్రసాదరావు తెలిపారు. అందులో భాగంగానే ఈ నెల 3 నుంచి 14 వరకు గ్రామాల్లో తనిఖీ చేసి గ్రామ సభలు నిర్వహిస్తారన్నారు. అనంతరం మండలంలో సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

మౌలిక వసతులు కరువు

- అసౌకర్యాల నడుమ బనగానపల్లె రైల్వేస్టేషన్
- తాగునీరు లేక ప్రయాణికులు అవస్థ
- అధ్వానంగా స్టేషన్ రహదారి
- రైళ్ల సంఖ్యను పెంచాలని వేడుకోలు

బనగానపల్లె, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : బనగానపల్లె పట్టణ శివారులో ఉన్న రైల్వే స్టేషన్ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. మూడు రైళ్లు మాత్రమే బనగానపల్లె మీదుగా నడుస్తున్నాయి. ధర్మవరం నుంచి వయా బనగానపల్లె, విజయవాడ మీదుగా మచిలీపట్నం వరకు ఒక రైలు, అలాగే గుంటూరు నుంచి నంద్యాల, బనగానపల్లె మీదుగా తిరుపతి వరకు ఒక రైలు, నంద్యాల నుంచి బనగానపల్లె మీదుగా రేణిగుంట వరకు ఒక డెమో రైలు నడుస్తోంది. అయితే ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నా రైల్వే స్టేషన్‌లో సమస్యలు ఎక్కడికక్కడే ఉన్నాయి.



పాచిపట్టిన నీటి కొళాయి



అధ్వానంగా బనగానపల్లె రైల్వే స్టేషన్ రహదారి



బనగానపల్లె రైల్వేస్టేషన్ ముఖద్వారం

రోడ్డు గుంతలమయం

బనగానపల్లె రైల్వేస్టేషన్ నుంచి ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు అర కిలోమీటరు రోడ్డు గుంతలమయంగా మారింది. వర్షం పడితే ఆటోలు, బైక్‌లు వెళ్లలేని పరిస్థితి. కనీసం సీసీ రోడ్డు కూడా వేయకపోవడంతో ప్రయాణికులు రైలు దిగి బనగానపల్లెకు రావాలంటే నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఆటో డ్రైవర్లు బాడుగకు రావడానికి జంకుతున్నారు. రైల్వేస్టేషన్ బనగానపల్లె పట్టణానికి ఒక కిలోమీటరు దూరంలో ఉండడంతో ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే అధికారులు ఇప్పటికైనా అధ్వానంగా ఉన్న మట్టి రోడ్డు స్థానంలో సీసీ రోడ్లు వేసి ప్రయాణికులకు సౌకర్యం కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

తాగునీరు కరువు

రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు తాగునీటికి అవస్థపడుతున్నారు. కుళాయిల ప్రాంతం అపరిశుభ్రంగా మారింది. మరుగుదొడ్లు ఉన్నా నీటి సౌకర్యం లేదు. ముఖ్యంగా మహిళలు ఇబ్బంది పడుతున్నారు. అలాగే మూడు రైళ్లు వచ్చేటపుడు అనౌన్సుమెంట్ కూడా ఉండడం లేదు. దీంతో ఏ ట్రైన్ ఎక్కడికి వెళ్తుందో కూడా ప్రయాణికులకు అర్థం కాని పరిస్థితి ఏర్పడింది.

రైల్వేస్టేషన్‌లో సౌకర్యాలు కల్పించాలి



రహదారి పూర్తి అధ్వానంగా ఉంది. నిత్యం రైల్వే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు కూడారాని దుస్థితి ఏర్పడింది. కనీసం రైల్వే స్టేషన్‌నుంచి మెయిన్ రోడ్డు వరకు విద్యుత్ లైట్లు కూడా లేవు. రైల్వే అధికారులు రహదారి ఏర్పాటు చేసి విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసి రైల్వే స్టేషన్‌లో సౌకర్యాలు కల్పించాలి.

- బీసీ రాజారెడ్డి, మాజీ సర్పంచ్, బనగానపల్లె

సీసీ రోడ్డు వేయాలి



రైల్వే ప్రయాణికులకు కనీస వసతులు రైల్వే అధికారులు కల్పించాలి. వర్షం కురిస్తే ఆటోలు రైల్వేస్టేషన్‌కు రావడం లేదు. దీంతో ప్రయాణికులు రాత్రివేళ రైల్వేస్టేషన్‌లో పడిగాపులు కాస్తున్నారు. మట్టిరోడ్డు స్థానంలో రైల్వే స్టేషన్ నుంచి బనగానపల్లె ప్రధాన రోడ్డు వరకు సీసీ రోడ్డు వేయాలి. అలాగే రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు మంచినీటి వసతి కల్పించాలి.

- తులసిరెడ్డి, సర్పంచ్, మిట్టపల్లె

ద్వితీయ సంవత్సరం ఇంటర్ పరీక్షలు ప్రారంభం

చాగలమర్రి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని వాసవీ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఇంటర్ ద్వితీయ సంవత్స రం పరీక్షలు ప్రారంభమయ్యాయి. 231 మంది విద్యార్థులకు గాను 225 మంది విద్యార్థులు సోమవారం పరీక్షలకు హాజరయ్యారని ప్రిన్సిపాల్ ఓబులేసు తెలిపారు. సీఎస్‌గా పెద్దన్న, డీవోగా చంద్రశేఖర్‌రెడ్డి పరీక్షలు నిర్వహించారు. ఉయ్యాలవాడ ఎస్ఐ వెంకటసుబ్బయ్య పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.



కొలిమిగుండ్లలో పరీక్షకు హాజరైన విద్యార్థులు

డోన్ టౌన్: పట్టణంలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి పట్టణంలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల, వెంకటేశ్వర జూనియర్ కాలేజీ, శ్రీసుధ కాలేజీ, ఏపీ మోడల్ స్కూల్‌లో పరీక్షలు జరిగాయి. ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మొత్తం 255 మందికి గానూ 254 మంది హాజరు కాగా, ఒకరు మాత్రమే గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ ఓబుల్‌రావు తెలిపారు. అలాగే ఏపీ మోడల్ స్కూల్‌లో మొత్తం 227 కి గానూ 223 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని చీఫ్ శ్రీనివాసులు తెలిపారు. సాయిశ్రీ కళాశాలలో 269 మందికిగానూ 259 మంది హాజరుకాగా, 10 మంది గైర్హాజరయ్యారని చీఫ్ చంద్రమోహన్ తెలిపారు. వెంకటేశ్వర కాలేజీలో 238 మందికి గానూ 235 మంది హాజరైనట్లు డిపార్టుమెంటల్ ఆఫీసర్ చాంద్‌బాషా తెలిపారు. అలాగే పట్టణంలోని శ్రీసుధ జూనియర్ కాలేజీని, వెంకటేశ్వర కాలేజీని ఫ్లయింగ్ స్క్వాడ్ శ్రీనివాస రెడ్డి పరిశీలించారు.

ఓపెన్ పరీక్షలు తనిఖీ

డోన్ పట్టణంలో ప్రారంభమైన ఓపెన్ పరీక్షలను డోన్ డిప్యూటీ డీఈవో వెంకట్రామిరెడ్డి సోమవారం ఆయా పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. సోమవారం పట్టణంలోని జడ్పీహెచ్ పాఠశాల (గర్ల్స్)ను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంఈవో-2 నరసప్ప ఉన్నారు.

కొలిమిగుండ్ల : ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. స్థానిక మోడల్‌స్కూల్ సెంటర్‌లో 102మందికి గాను 99మంది మాత్రమే పరీక్షలకు హాజరైనట్లు పరీక్షల ముఖ్య అధికారి శ్రీనివాసరెడ్డి, డిపార్ట్‌మెంటల్ అధికారి రామయ్య వెల్లడించారు.

ఘనంగా ఉమామహేశ్వరస్వామి పల్లకీ సేవ

బనగానపల్లె, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి క్షేత్రంలో ఉమామహేశ్వర స్వామి పల్లకీ ఉత్సవం సోమవారం అత్యంత ఘనంగా సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఆలయ ఈవో చంద్రుడు, మౌళీశ్వరరెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డితో పాటు భక్తులు, ఆలయ పూజారులు పల్లకీలో ఉమామహేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పల్లకి సేవ కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు.



యాగంటి క్షేత్రంలో లో పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

క్రీడాకారులకు అన్ని విధాలా సహకరిస్తాం



విజేతలకు బహుమతులు అందిస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : క్రీడలను, క్రీడాకారులకు అన్ని విధాలా సహకరిస్తామని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. సోమవారం బనగానపల్లె పట్టణంలో శాఖాగ్రంథాలయంలో బీసీ ఇందిరమ్మ చెస్ పోటీలు ప్రారంభించి విజేతలకు బహుమతులు అందించారు. ఈసందర్భంగా చెస్ పోటీలు ఆడడానికి వచ్చిన చెస్ క్రీడాకారులను ఆమె అభినందించారు. భారీ చెస్ టోర్నమెంట్‌తో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికి తీస్తున్న నిర్వాహకులను ఆమె అభినందించారు. టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులకు బీసీ ఇందిరమ్మ భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో పలువురు క్రీడాకారులు, కోచ్‌లు, కూటమి నాయకులు స్థానిక యువక్రీడాకారులు, బీసీ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తుండ్లవాగు రిజర్వాయరులో తగ్గిన నీటి మట్టం



తుండ్లవాగు రిజర్వాయరు

రుద్రవరం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : తుండ్లవాగు రిజర్వాయరులో నీటి మట్టం తగ్గింది. వ్యవసాయ బోరుబావుల్లో భూగర్భజలం తగ్గిపోతుందని చుట్టుపక్కల గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. రిజర్వాయర్‌ను నమ్ముకొని పంటలు సాగు చేశామని, ఇప్పుడే నీటి మట్టం తగ్గిపోవడంతో పంటలను ఎలా కాపాడుకోవాలో అర్థం కావడం లేదని తలలు పట్టుకుంటున్నారు.

మురుగు నీరే శరణ్యం

చాగలమర్రి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని అడ్డవాగు సమీపంలో కౌలు రైతు నాగేశ్వర్‌రెడ్డి 16 ఎకరాల్లో మొక్కజొన్న, సజ్జ, పసుపు పంటలను సాగు చేశాడు. పొలంలో ఉన్న బోరునీరు అడుగంటిపోవడంతో చేతికొచ్చిన పంటలను కాపాడుకునేందుకు గ్రామంలో నుంచి వచ్చే మురుగు నీటిని నిలుపుకొని విద్యుత్ మోటార్ల ద్వారా పొలంలోకి పైపులు వేసి పారించుకుంటున్నాడు. మురుగు నీటిని మళ్లించుకునేందుకు కూడా రూ.20 వేలు దాకా ఖర్చు చేయాల్సి వచ్చిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.



మొక్కజొన్నకు మురుగునీరు కడుతున్న కౌలు రైతు



మురుగు నీటి కుంటకు వేసిన పైపులు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

‘పది’లో వందరోజుల ప్రణాళిక

- వీరరాఘవయ్య, ఇన్‌చార్జి ఎంఈవో, రుద్రవరం



రుద్రవరం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : వందరోజుల ప్రణాళికతో పదవ తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం పెంచుతామని ఎంఈవో వీరరాఘవయ్య అన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. సోమవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

ప్రశ్న: మండలంలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయి?

జవాబు : మండలంలో 44 ప్రాథమిక పాఠశాలలు, మూడు ప్రాథమికోన్నత పాఠశాలలు, తొమ్మిది ఉన్నత పాఠశాలలు ఉన్నాయన్నారు. వీటిల్లో 4,674 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

ప్రశ్న: పదోతరగతి విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేందుకు ఎలా చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు : మండలంలో పదోతరగతి విద్యార్థులు 460 మంది ఉన్నారు. రుద్రవరం, ఆదర్శ పాఠశాల, కస్తూర్బాగాంధీ గురుకుల విద్యాలయం, నరసాపురం, ఆలమూరు, ఎర్రగుడిదిన్నె, పెద్దకంబలూరు, యల్లావత్తులలో ఉన్నత పాఠశాలలు ఉన్నాయన్నారు. వందరోజుల ప్రణాళికతో మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నాం.

ప్రశ్న: పాఠశాలల్లో ఆదివారం మధ్యాహ్నభోజన పథకం కొనసాగుతుందా?

జవాబు : కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఆదేశాల మేరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం కొనసాగిస్తున్నాం.

ప్రశ్న: నాడు, నేడు పనులు నిలిచిపోయాయి కదా?

జవాబు : నాడు, నేడు పనుల్లో భాగంగా పాఠశాల అదనపు గదులు, ప్రహరి నిర్మాణాలు పనులు చేపట్టాం. పనులు నిలిచిపోయింది వాస్తవమే. ఈ విషయాన్ని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

ప్రశ్న: పదోతరగతిలో వెనుకబడ్డ విద్యార్థులపై ఎలాంటి దృష్టి సారించారు?

జవాబు : వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాం. ఉన్నతాధికారులు సూచనలు తూచా పాటిస్తున్నాం. డిగ్రేడ్‌లో ఉన్న విద్యార్థులను ఒక్కో ఉపాధ్యాయుడికి పది మందిని అప్పగించాం. ప్రణాళిక ప్రకారం బోధిస్తూ మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేస్తున్నాం.

ప్రశ్న: ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి?

జవాబు: పాఠశాల్లో సమయపాలన ఉపాధ్యాయులు పాటించాలి. ఉదయం 9గంటలకు ప్రతి ఉపాధ్యాయుడు పాఠశాలకు హాజరై ఫేస్‌యాప్ ద్వారా హాజరు వేయించుకోవాలి. ఉపాధ్యాయుడు దిక్సూచిలా ఉండి విద్యా బోధన చేయాలి.

చెరువుగట్ల మరమ్మతులకు నిధులు మంజూరు

రుద్రవరం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలో చెరువు గట్లపై కంపచెట్లు తొలగింపునకు కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు సోమవారం ఏఈ రఘురాముడు తెలిపారు. కొండమాయపల్లె చిన్నరాజచెరువు గట్లపై పనులు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. కొండమాయపల్లె, చిన్నరాజచెరువుకు రూ. 2,58,108, రుద్రవరం రంగారెడ్డి చెరువుకు రూ. 1,34,333 చిన్నకంబలూరు కొత్త చెరువుకు రూ. 1,32,709, ముకుందాపురం ఎర్ర చెరువుకు రూ. 1,40,724, పెద్దకంబలూరు కేశవరావు చెరువుకు రూ. 1,39,752, టీరవోలు చెరువుకు రూ. 2,42,012, బి.నాగిరెడ్డిపల్లె సోమయాజులపల్లె చెరువు రూ. 2,66,342, చిన్నకంబలూరు అంకి రెడ్డికడపల్లె చెరువుకు రూ. 1,34,277, కోటకొండ కళ్యాణి చెరువుకు రూ. 1,40,223, వెలగలపల్లె గంగమ్మ చెరువుకు రూ. 35,933, శ్రీరంగాపురం తిమ్మన్నచెరువు రూ. 1,42,581 మంజూరైనట్లు తెలిపారు.

అభ్యంతరం చెప్పొద్దు : తహసీల్దారు



గ్రామస్థులతో మాట్లాడుతున్న తహసీల్దారు మల్లిఖార్జునరావు

రుద్రవరం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : శ్మశాన వాటికకు వెళ్లేవారికి అభ్యంతరం చెప్పొద్దని తహసీల్దారు మల్లిఖార్జునరావు సూచించారు. తన పంట పొలంలో మృతదేహాలు తీసుకెళ్తే రూ. లక్ష జరిమానా విధిస్తామని పొలం యజమాని ఐదురోజుల క్రితం టాంటాం వేయించింది. గ్రామస్థులు సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేసి సమస్యను వివరించారు. దాంతో కలెక్టర్ స్పందిస్తూ గ్రామానికి వెళ్లి సమస్యను పరిష్కరించాలని తహసీల్దారు మల్లిఖార్జునరావును ఆదేశించారు. హుటాహుటిన తహసీల్దారు గ్రామానికి చేరుకుని శ్మశాన స్థలాన్ని పరిశీలించారు. పొలం యజమాని, గ్రామస్థులతో చర్చించారు. శ్మశానానికి వెళ్లే వాళ్లకు అభ్యంతరం చెప్పవద్దంటూ పొలం యజమానికి సూచించారు. పాత పద్ధతిలోనే వెళ్లాలని గ్రామస్థులకు తెలిపారు.

డోన్ ఈఈగా కమలాకర్‌రావు



డోన్ టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): డోన్ విద్యుత్ శాఖ ఈఈగా కమలాకర్‌రావు సోమవారం స్థానిక విద్యుత్ శాఖా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఏఈ నాగేశ్వర రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేంద్ర, ఏఈలు నాగరాజు, శివ, ఏఏవో ఆది లక్ష్మి, తదితరులు అభినందనలు తెలిపారు.